'ఆఫీసు కథలు ఆరు'లో మూడవది

# దండన

సమ్మో ప్రసాదరావు

**రామనాథం గదిలోనికి డిప్యూటీ డైరెక్టరుగారి ప్యూను వచ్చి "అయ్యగారు మిమ్మల్ని అర్జెంటుగా రమ్మన్నారు" అన్నాడు.**

రామనాథానికి డిప్యూటీ డైరెక్టరుగారు ఎందుకు పిలుస్తున్నారో అర్థం కాలేదు. పెద్దాఫీసుకి పంపవలసిన రిపోర్టులు సకాలంలోనే వెళ్ళిపోయాయి. ఈ మధ్యనే వచ్చిన డి.ఓ. లెటరు జవాబు సంతకం అయి వచ్చింది. మరి అర్జెంటు పనేముంది? ఎక్కడో పొరపాటు జరిగి ఉంటుంది. చీవాట్లు పెట్టడానికి కాక తనను రూముకి రమ్మనడు. మధ్య తరగతి ఆఫీసరు పని 'త్రిశంకు నరకం' లాంటిది. అసిస్టెంటు డైరెక్టరుగా ప్రమోషను వస్తే పొంగిపోయాడు. ఆ సంతోషం ఆరు నెలలకే హారతి కర్పూరంలా హరించుకుపోయింది. పై ఆఫీసర్లు ఇష్టం ఉంటే ఆఫీసుకి వస్తారు. లేకపోతే ఇంటి నుంచి ఫోనులోనే ఆదేశా లిస్తారు - ఇక గుమస్తాల చేత పని చేయించడం చాలా చిక్కు సమస్య. జాప్యం జరిగితే చీవాట్లు తినడానికి త సున్నాడు. సీనియరు క్లర్కుగానూ, సూపరింటెండెంటుగానూ ఉన్నప్పుడే నయం. గానుగెద్దులా పని చేసినా బాధ్యత అంత ఉండేది కాదు. తిట్లూ, దీవనలూ ఉండేవి కావు. ఈ ప్రమోషను మూలంగా మనశ్శాంతి కరువైంది. ఎప్పుడూ టెన్షనే.

"సర్! నన్ను పిలిచేరట."

"కూర్చో! సింహాచలం నీ సెక్షనులోనేగా పని చేస్తున్నాడు?"

రామనాథం తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు. సింహాచలంతో ఏదో పని ఉండి ఉంటుంది.

"అవును, సర్, అతను నా సెక్షనులోనే ఉన్నాడు."

"అతని పని పట్ల నీ అభిప్రాయం ఏమిటి? సరిగ్గా పని చేయడని విన్నానే."

"సర్! అలాంటి దేం లేదు. తన ప నేదో తను చేసుకుపోతాడు. తెలియని విషయాలు అడిగి మరీ చేస్తాడు. ఎవరో కిట్టనివాళ్ళు మీకు చెప్పి ఉంటారు."

"రామనాథం! నేను హెడ్డుని. నన్ను దబాయించాలని ప్రయత్నించకు."

"సర్! నేను నిజం చెప్తున్నాను. సింహాచలం కొత్తవాడైనా పనిలో అశ్రద్ధ లేదు."

"రామనాథం! నాకు విషయాలు తెలియ వనుకున్నావా? అతను నాలుగు రోజులై డ్యూటీకి రావడం లేదు."

"అదా, సర్, మీరు పని గురించి అడిగారు. నిజమే అతను గత శనివారం నుంచి ఆఫీసుకి రావడం లేదు. ఇంటి నుంచి టెలిగ్రాం వస్తే



సెలవు చీటీ పంపి వెళ్లాడు."

"ఈ విషయం నువ్వు దాచాలని ప్రయత్నించావా? నా నోటీసుకి ఎందుకు తేలేదు? ముఖ్యాలయం నుండి బయటకు వెళ్తే ముందుగా అనుమతి తీసుకోవాలని రూలుందే! అతను ఎవరి అనుమతితో ఈ ఊరు వదిలాడు? ఈ విషయం రాతపూర్వకంగా నీవు నా దృష్టికి తెచ్చావా? నేను రూల్సు పాటించే వ్యక్తిని. నీవు బాధ్యత విస్మరిస్తే నీమీదా చర్య తీసుకోవలసి ఉంటుంది."

"సర్! నేను తెలియజేయని మాట యథార్థమే. అయితే లోగడ వెంకట్రావు సెలవు తీసుకోకుండా ఊరికి వెళ్తే మీకు రాసి ఇచ్చాను. అప్పుడు మీరు నన్ను పిలిచి ఏమన్నారు? 'రామనాథం! ఇలాంటి చిన్న చిన్న విషయాలను గోరంతలు కొండంతలు ఎందుకు చేస్తావు? రాగానే అప్లికేషను తీసుకో. నాలుగు చీవాట్లు పెట్టు' అన్నారుగా! ఇతను సెలవు చీటీ ఇచ్చే వెళ్లాడు."

"నే నలాగే అని ఉంటాను. పిడుక్కీ, బియ్యానికీ ఒకటే మంత్రమా? అయినా ఈ ఆఫీసులో నీవు పెద్దా, నేను పెద్దా? ఎవరిమీద ఎలాంటి చర్య తీసుకోవాలో అది నా నిర్ణయం మీద ఆధారపడి ఉంటుంది."

"సర్! అర్జెంటుగా రమ్మని ఇంటినుంచి టెలిగ్రాం వస్తే ఎవరైనా రూల్సు పాటిస్తూ కూర్చోగలరా? సింహాచలాన్ని నేను మందలిస్తాను."

"నీవు నీ జూరిస్ డిక్షన్ని అతిక్రమిస్తున్నావు. జీ.ఓ.ను కోట్ చేస్తూ అతడ్ని సస్పెండు చేయమని నాకు నోట్ పుటప్ చెయ్యి. వీళ్లకు భయం, భక్తి లేకుండా పోయాయి. నిన్న వెంకట్రావు, ఇవాళ సింహాచలం. రేపు మరొకడు. ఇది ప్రభుత్వ ఆఫీను అనుకున్నారా? పాఠశాల అనుకున్నారా? ఇంక నువ్వు వెళ్లు."

రామనాథం తిరిగి వచ్చి సీట్లో కూర్చున్నా డన్నమాటే కాని పనిమీద మనను లగ్నం కాలేదు. భయం భక్తి లేకుండా పోయినంత తప్పిదం అత నేం చేశాడు? కాని రామనాథం అధికారి చెప్పినట్లు నడుచుకోవాలి. అందుకే అతను హెడ్ గుమాస్తాని పిలిచి సింహాచలం ఫైలూ, అతని అప్లికేషను తెప్పించి అధికారి అజ్ఞ మేరకు నోటు రాసి పంపాడు.


హెడ్ గుమాస్తా నివ్వెరపోయాడు. "మరీ ఇంత పెద్ద దండనా?" అన్నాడు.

"నా పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలాగుంది. నేను చేసేది ఏమీ లేదు. కావాలంటే నువ్వు డి.డి.గారితో మాట్లాడు."

అయితే రామనాథం తీసుకున్న చర్య ఆఫీసులో గుప్పుమంది. అందరూ రామనాథాన్ని నిర్దయుడని తూలనాడసాగారు. రామనాథం వింటూన్నా ఏమీ చేయలేకపోయాడు. వారికి తను సంజాయిషీ ఇవ్వలేదు. ఇచ్చినా వారు నమ్మరు. ఈ పోస్టే ముళ్లకిరీటం.

మరునటి రోజు సింహాచలం డ్యూటీకి వచ్చాడు. అతనికి శ్రేయోభిలాషులు జరిగిందంతా చెప్పారు. "నీ సస్పెన్షను ఆర్డరు డి.డి.గారి సంతకంతో ఉంది" అన్నారు.

"సర్! తప్పు అయిపోయింది. క్షమించండి."




ప్రాధేయపడ్డాడు సింహాచలం.


రామనాథానికి జాలి వేసింది. అయినా అతను నిస్సహాయుడు. "నా చేతుల్లో ఏమీ లేదు" అన్నాడు.

సాయంత్రం నాలుగు గంటలప్పుడు డి.డిగారు ఫోన్ చేసి రాత్రి ఎనిమిది గంటలకు ఇంటికి రమ్మన్నారు.

డి.డి.గారి ఆజ్ఞలను పాలించడం అతని కర్తవ్యాల్లో ఒకటి. ఆ సమయానికి రామనాథం డి.డి.గా రింటికి వెళ్లాడు. లోపల అతను ఎవరితోనో మాట్లాడుతున్నారు. "మీరొస్తే కూర్చోమన్నారు" అన్నాడు ప్యూను. బయట కెటో వెళ్తూ.

"సింహాచలం! ఈ పర్యాయం క్షమిస్తున్నాను. మళ్లీ ఇలాంటిది జరగకూడదు. రామనాథానికి నేను నర్ది చెప్తాలే."

రామనాథం సంతోషించాడు. ఎలాగైతేనేం డి.డి.గారు ప్రసన్ను లయ్యారు. సింహాచలం బ్రతికిపోయాడు. అదే చాలు!



సింహాచలం బయటి కొచ్చాడు. రామనాథాన్ని ఒక చీడపురుగు చూసినట్లు చూశాడు. సింహాచలం వేలిన ఉంగరం రామనాథానికి కనిపించలేదు. ఆ స్థానంలో తెల్లగా మచ్చ ఉంది.

రామనాథం లోనికి అడుగు పెట్టాడు. డి.డి.గారు వంద రూపాయల నోట్లు లెక్కపెడుతూ ఇతడ్ని చూడగానే వాటిని జేబులో పెట్టుకున్నారు. అతని ముందు టీపాయ్ మీద ఖాళీ కవ రుంది. రామనాథానికి ఒక విషయం అర్థం అయింది. సింహాచలాన్ని అతను ఎలా దండించాడో! ఆర్థిక దండనా ఒక దండనే.

"కూర్చో రామనాథం!"

అతను ప్రసన్నవదనంతో ఉన్నాడు.

"రామనాథం! బాగా ఆలోచించిన మీదట నీవు చెప్పినదే సరియైన దనిపించింది. ఇంటినుంచి టెలిగ్రాం వస్తే ఎవరు మాత్రం రూల్సు పాటిస్తూ కూర్చుంటారు? నువ్వు చెప్పావుగా క్షమించమని. అత నొచ్చాడు. గట్టిగా నాలుగు చీవాట్లు పెట్టి తగిలేశాను. నేను చేసింది రైటే నంటావా?"

"మీరు చేసింది తప్పు..." అంటూ ఒక్క క్షణం ఆగి "... అని ఎలా అంటాను, సార్! మీది దయార్ద్ర హృదయం. అతనికి మీరు సరియైన దండన విధించి వదిలేశారు. అదే సంతోషం" అన్నాడు.

డి.డి.గారు నవ్వారు. ఆ నవ్వు వెనుక భావం ఏమిటో?

"రామనాథం! ఆఫీసు అవర్సులో గోవిందరావు చిన్న ట్రాన్సిస్టర్‌లో క్రికెట్ స్కోరు వింటూ పని చేయడం లేదని విన్నాను. అందుకే అత నే పని చేసినా తప్పులు తడకలుగా ఉన్నాయి. ఈ నెల రోజుల అతని పనిని సమీక్షిస్తూ ఒక రిపోర్టు తయారుచెయ్యి. వీళ్లను దండించకపోతే లాభం లేదు."

"అలాగే సార్!" అన్నాడు రామనాథం.

దండిస్తే లాభం ఉంటుంది. ఎవరికి?

ఈ వ్యవస్థే మరి అలాంటిది!